క్లుప్తంగా

దాత ఆశయాలు నెరవేర్చాలి



రూ.25 వేల చెక్కును అందిస్తున్న దేవదాయశాఖ డీసీ విజయరాజు

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా కమిటీ సభ్యులు పనిచేయాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న విడోస్ హోం వ్యవస్థాపకుడు పైడా రామకృష్ణయ్య వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక మహర్షి సాంబమూర్తి దివ్యాంగుల పాఠశాలకు రూ.25 వేల చెక్కును శుక్రవారం అందించారు. నిరుపేదల కోసం దాతలు తమ యావదాస్తిని ట్రస్ట్‌లకు దారపోశారన్నారు. వారి ఆశయాలను నెరవేర్చడం తమ బాధ్యత అన్నారు. జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, దేవాదాయశాఖ డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, విడోస్ హోం చైర్మన్ పైడా రామకృష్ణారావు పాల్గొన్నారు.

డాక్టర్ మద్దాకు నివాళి



సంతాప సభలో మాట్లాడుతున్న వర్సిటీ రిజిస్ట్రార్ అశోక్

కాకినాడ రూరల్: నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌తో డాక్టర్ మద్దా సత్యనారాయణకు విడదీయరాని బంధం ఉందని, ఆయన నిరంతరం విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దడంతో శ్రమించారని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.అశోక్ పేర్కొన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో శుక్రవారం సత్యనారాయణ సంతాప సభను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో రిజిస్ట్రార్‌తో పాటు సత్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొని ఆయనను స్మరించుకున్నారు.

లైంగిక వేధింపుల నివారణకు కమిటీలు

కాకినాడ రూరల్: మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం – 2013 ప్రకారం పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు అరికట్టడానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీలను యాజమాన్యాలు ఏర్పాటు చేయాల్సి ఉందని న్యాయవాది కె.నాగజ్యోతి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చాలా చోట్ల పని ప్రదేశాలలో బాలికలు, వృద్ధులు అని చూడకుండా అత్యాచారాలు జరుగుతున్నాయని, ఇటువంటివి నిర్మూలించేందుకు మహిళా చట్టాలను సక్రమంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అడబాల రత్నప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాత బాపిరాజు తదితరులు

కాకినాడ రూరల్: ఉగాది పండగను పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేదలకు విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు శుక్రవారం నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త డాక్టరు శిరీష, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం వేళంగిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పార్టీ శ్రేణులతో పర్యటించి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించి, కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, పార్టీ నాయకులు చుండ్రు వెంకన్నారావుచౌదరి, యర్రమాటి లింగన్న, వెలుగుల లచ్చారావు, బుంగా సింహాద్రి, వాసంశెట్టి పట్టాభి, కె.వెంకట్రావు పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు జాతి ఆవు దూడ జననం



యజమానితో ఆవు, దూడ

పిఠాపురం: స్థానిక సీతయ్య గారితోటకు చెందిన పాడి రైతు ద్విభాష్యం కుమార సుబ్రహ్మణ్య శర్మకు చెందిన ఆవు శుక్రవారం పుంగనూరు జాతి దూడకు జన్మనిచ్చింది. దూడ 15 అంగుళాల ఎత్తు మాత్రమే ఉందని, పూర్తి ఆరోగ్యంగా ఉందని రైతు సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు.

మొండిఘటాలకు ముచ్చటైన మాట!

- మొండిబకాయిలపై వడ్డీ మాఫీ
- పన్ను చెల్లింపుదారులకు రూ.10.5 కోట్ల ప్రయోజనం
- వసూళ్లకు కార్పొరేషన్ ప్రణాళిక

కాకినాడ: దీర్ఘకాలంగా వసూలు కావలసిన ఆస్తి, కుళాయి పన్నులపై వడ్డీ రాయితీ ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పన్ను చెల్లింపుదారులకు తీపికబురు అందించింది. వివిధ కారణాలతో దాదాపు పదేళ్లుగా నగరపాలక సంస్థకు బకాయిపడ్డ పన్నులన్నింటినీ ఒకేసారి ఏకమొత్తంగా చెల్లించే వారికి మొత్తం వడ్డీ మాఫీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో నగరపాలక సంస్థ పరిధిలోని మొండి బకాయిదారులకు ప్రయోజనం చేకూరనుంది. దీంతో కార్పొరేషన్ ఖజానా నిండనుంది. కార్పొరేషన్ పరిధిలో జరిమానాలు, ఇతర కారణాల వల్ల మొండి బకాయిలు ఎక్కువగానే ఉన్నాయి. రెవెన్యూ అధికారులు తేల్చిన లెక్కల ప్రకారం రూ.8.82 కోట్లు వసూలు కావలసి ఉంది. ఈ బకాయిలపై రూ.10.5 కోట్లు పెనాలిటీగా ప్రజలు చెల్లించాల్సి ఉంది. ఇది కాకుండా మరో రూ.1.97 కోట్లు కోర్టు వివాదాల్లో ఇరుక్కుపోయాయి. వీటిపై మరో రూ.3 కోట్లు రావలసి ఉంది. ఈ మొత్తాల వసూలుకు తాజా ఉత్తర్వులు ఉపకరించనున్నాయి. సుమారు ఐదు నుంచి పదేళ్లుగా కట్టని బకాయిలను ఇప్పుడు ఏకమొత్తంగా చెల్లిస్తే రూ.10.5 కోట్లు చెల్లింపుదారులకు ప్రయోజనం పొందే వెసులుబాటు కనిపిస్తోంది. 2019 తరువాత ఈ తరహా వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించడంతో పన్నుచెల్లింపుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ బకాయిలపైనా దృష్టి...

ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ భవనాల ద్వారా రావలసిన మొండి బకాయిలపై కూడా నగరపాలక సంస్థ దృష్టిసారించింది. ఈ మేరకు కమిషనర్ కె.రమేష్, అదనపు కమిషనర్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ ప్రభుత్వ భవనాల బకాయిలపై దృష్టిపెట్టారు. ప్రభుత్వ భవనాల ద్వారా సుమారు రూ.11 కోట్లు పన్ను రూపంలోను, రూ.19 కోట్లు పెనాల్టీ రూపంలో రావాల్సి ఉందని తేల్చారు. ఇప్పుడు రూ.11 కోట్ల పాత బకాయి చెల్లిస్తే వచ్చే ప్రయోజనాన్ని తెలియజేస్తూ ఆయా ప్రభుత్వ శాఖలకు లేఖలు పంపుతున్నారు.



వడ్డీ మాఫీ హర్షణీయం



పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ఆస్తిపన్నుల పెరుగుదలపై అభ్యంతరాలు ఉన్నప్పటికీ చెల్లింపుదారుల పట్ల సానుకూల దృక్పథంతో వడ్డీ మాఫీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు మరికొంత సమయం గడువు పెంచితే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

– వైడీ రామారావు, అధ్యక్షుడు, రేట్ పేయర్స్ అసోసియేషన్

సద్వినియోగం చేసుకోండి



ఆస్తి, ఖాళీస్థలాల పన్నుపై వడ్డీరాయితీ ఇస్తూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలి. పాత, కొత్త బకాయితో సహా మొత్తం సొమ్మును ఏకమొత్తంగా ఈ నెల 31 లోపు చెల్లించిన వారికే ఈ రాయితీ వర్తిస్తుంది. ప్రభుత్వం కల్పించిన సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

– కె.రమేష్, కార్పొరేషన్ కమిషనర్

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

కాకినాడ: ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పన్నుల వసూళ్ళు, యూజర్ చార్జీలపై ఆయా శాఖల అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను రూ.35 కోట్లు వసూలు కావలసి ఉండగా రూ.30 కోట్లు వసూలయ్యాయన్నారు. కుళాయి పన్నులు మరో రూ.ఆరు కోట్లు వసూలు కావలసి ఉందన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టిపెట్టి మార్చి 31వ తేదీ నాటికి నూరుశాతం వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని బకాయిదారులను కోరారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆస్తిపన్ను, యూజర్ చార్జీలకు సంబంధించి అసెస్‌మెంట్ నెంబర్‌ను మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికే 80 శాతం పూర్తయ్యిందని, మిగిలిన ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్ మాట్లాడుతూ యూజర్ చార్జీల వసూళ్లపైనా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ నాగ నరసింహారావు

ప్రతి శుక్రవారం డ్రైడే

- దోమల నివారణకు చర్యలు చేపట్టాలి
- ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి రమేష్



వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్, డీఎంఓ భాస్కరరావు

కరప: అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి, క్షయ, ఫైలేరియా నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్ అన్నారు. కరపలో శుక్రవారం ఆయన డీఎంఓ (జిల్లా మలేరియా అధికారి) డాక్టర్ ఎస్.భాస్కరరావుతో కలసి పర్యటించి పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు చేశారు. పీహెచ్‌సీ ఆవరణలోని గురుకుల పాఠశాలను సందర్శించి పరిసరాలను, అక్కడున్న డ్రైన్‌ను పరిశీలించి సూచనలిచ్చారు. డివిజనల్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, సీహెచ్ఓ వై.రత్నకుమారి, ఎంపీహెచ్ఓలు ఎం.గంగాధర్, బీఎస్‌జీఎస్ కుమార్, ఎంపీహెచ్ఎస్‌లు కె.రాధాకృష్ణ, కె.రాజగోపాలరావు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి హుండీల ఆదాయం లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలో బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి హుండీలను శుక్రవారం లెక్కించారు. ఆరునెలలకు రూ. 2.69 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. హుండీల లెక్కింపులో దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హైస్కూలుకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ



కంప్యూటర్, ప్రింటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆశాజ్యోతి, దాత కుమారిరూనీ తదితరులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాతల వితరణతో కంప్యూటర్, ప్రింటర్ సమకూరాయి. పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయిని గెద్దం కుమారి రూనీ, బదిలీపై వెళ్లిన తెలుగు ఉపాధ్యాయుడు అద్దంకి వెంకటేశ్వరరావు సంయుక్తంగా రూ.60 వేలు విలువచేసే సిస్టమ్, ప్రింటర్‌ను వైజాగ్ శారదాపీఠం ఉభయగోదావరి జిల్లాల కన్వీనర్ చాగంటి సూరిబాబు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ద్వారా శుక్రవారం హెచ్‌ఎం యు.లీలామనోహర్‌కు అందజేశారు. పీఎంసీ చైర్మన్ ఎస్.రమాదేవి, ముద్రగడ పెద్దకాపు, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్‌కుమార్, గొర్రెల వెంకన్న, గందం రమణమూర్తి, కె.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్క్స్ తత్వాన్ని అర్థం చేసుకోవాలి

- అధ్యాపకుడు పెద్దింశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు పెద్దింశెట్టి లెనిన్‌బాబు

కాకినాడ సిటీ: అన్ని రుగ్మతలకు కారణం పెట్టుబడిదారీ సమాజమేనని, ఇది అర్థం కావాలంటే మార్క్సిజం అధ్యయనం చేయాలని అధ్యాపకుడు పెద్దింశెట్టి లెనిన్‌బాబు అన్నారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మిక సంఘాల పూర్వ నాయకులు వాసంశెట్టి సూర్యారావు వర్ధంతిని పురస్కరించుకొని కాకినాడ సుందరయ్యభవన్‌లో స్టడీ సర్కిల్‌లో వర్తమానంలో మార్క్సిజం ప్రాధాన్యం అనే అంశంపై ముఖ్యవక్తగా ఆయన ప్రసంగించారు. శ్రామిక వర్గం శ్రేయస్సు కోసం కార్ల్ మార్క్స్ తన జీవితాన్ని వెచ్చించి ప్రతిపాదించిన మార్క్సిస్టు తత్వాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. నేడు కార్పొరేట్ శక్తులు, హిందుత్వశక్తుల సమ్మిళిత పాలనే మోడీ ప్రభుత్వమన్నారు. పూర్వ అధ్యాపకులు కట్టా కృష్ణారావు, పెద్దింశెట్టి రామకృష్ణ తదితరులు సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా రైతు సంఘం నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, శేషుబాబ్జీ, వల్లు రాజబాబు పాల్గొని మాట్లాడారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురం సాంఘిక సంక్షేమశాఖ బాలికల హాస్టల్ విద్యార్థిని పులిదిండి మణికుమారి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతికి హాస్టల్ వార్డెన్ కారణమని, వారిని సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, దళిత సంఘాల ప్రతినిధులు శుక్రవారం రాత్రి హాస్టల్ వద్ద ఆందోళనకు దిగారు. రామచంద్రపురం మండలం హసనబాదకు చెందిన మణికుమారికి ఈనెల 13న వాంతులు కావడంతో వార్డెన్ ట్యాబ్లెట్ ఇచ్చారు. పరీక్షలు రాస్తున్న ఆమెకు మరుసటి రోజూ వాంతులు కావడంతో వార్డెన్ జీజీహెచ్‌కు తీసుకువెళ్లి పరీక్షలు చేయించి సమస్య ఏమీ లేదని వైద్యులు చెప్పడంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పంపేశారు. కాగా ఆమె పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. ఆమె మృతికి హాస్టల్ వార్డెనే కారణమని, ఆమెను, సోషల్ వెల్ఫేర్ డీడీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల ప్రతినిధుల ఆందోళన రాత్రి వరకు కొనసాగింది. ఆందోళనకారులతో డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ కృష్ణ, హాస్టల్ అధికారుల సంఘం నాయకులు ప్రసాద్‌బాబు దళిత సంఘాల ప్రతినిధులతో చర్చించారు.

20, 21 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కాకినాడ: కాకినాడలోని 11 ప్రాంతాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఆధార్‌లో ఉన్న పాత తూర్పుగోదావరి జిల్లా స్థానంలో కాకినాడ జిల్లాగా తప్పనిసరిగా మార్పు చేసుకునేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ అనుసంధానం చేయడంతో పాటు, చిరునామాలు, పుట్టిన తేదీల్లో మార్పులు వంటి ఇతర సేవలను కూడా పొందవచ్చునన్నారు. నగరంలోని కృష్ణనగర్–2ఎ, డైరీఫారం–11ఎ, గోలీలపేట–14ఎ, యానాంరోడ్డు –15ఎ, చిన్న మార్కెట్–21ఎ, యాళ్లవారివీధి –28బి, జగన్నాథపురం –30బి, బ్యాంకుపేట–32ఎ, గాంధీనగర్–38ఎ, రామారావుపేట 40బి, గైగోలుపాడు 50బి సచివాలయాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

ఏలేశ్వరం పోలీసులపై చర్యలు తీసుకోండి

కాకినాడ సిటీ: కిడ్నాప్ కేసును తప్పుదోవ పట్టిస్తున్న ఏలేశ్వరం పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ మండలం రమణయ్యపేటకు చెందిన సాంబత్తుల లక్ష్మి శుక్రవారం జేసీని కలసి కోరారు. తన బాలికను అదే గ్రామానికి చెందిన కాతేటి రవి, అతని స్నేహితులు చేట్ల అప్పలరాజు, సిలికోటి చంద్రరావు, మిరియాల రాముడు తదితరులు ఈనెల 11వ తేదీ రాత్రి కిడ్నాప్ చేసి తీసుకెళ్లిపోయారని వివరించారు. ఆ సమయంలో తన కుమార్తె చర్చికి వెళ్తోందన్నారు. ఈ విషయం జరిగిన వెంటనే గ్రామ పెద్దల సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామన్నారు. ఏలేశ్వరం పోలీసులు కిడ్నాప్ కేసుగా నమోదు చేయకుండా కేసును తప్పుదోవ పట్టించి మిస్సింగ్ కేసుగా నమోదు చేశారన్నారు. ఈ సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా తమ బిడ్డ ఆచూకీ లభ్యం కాలేదని జేసీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి జైభీమ్‌పార్టీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగుపల్లి కృష్ణ సంఘీభావం తెలిపి ఏలేశ్వరం పోలీసులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏఎంవీఐపై దాడి బాధాకరం

- ఏటీసీ ప్రసాదరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ట్రాన్స్‌పోర్టు కమిషర్ ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విధి నిర్వహణలో ఉన్న ఏఎంవీఐ చిన్నారావుపై దాడి బాధకరమని అడిషనల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఏఎస్‌వీ చిన్నారావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నుంచి వచ్చిన ఆయన కాకినాడ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యూనిఫాంలో ఉన్న ఉద్యోగిపై దాడి చేయడం తగదని, రవాణాశాఖ తరఫున కేసు వేగవంతంగా పూర్తిచేసేలా కృషిచేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ పరిపాలనలో భాగస్వాములే తప్ప వ్యక్తిగత అజెండాలు ఏవరికీ ఉండవని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తారన్నారు. ప్రశాంతమైన నగరంలో ఇటువంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. రవాణాశాఖ టెక్నికల్ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఉన్నప్పుడు బాడీ కెమెరాలు అమర్చడానికి ఉన్నత అధికారులతో చర్చిస్తామన్నారు. రవాణాశాఖ మంత్రి విశ్వరూప్ ప్రత్యేక శ్రద్ధతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జేటీసీ సీహెచ్ శ్రీదేవి, ఎంవీఐలు మురళీకృష్ణ, హరినాథరెడ్డి, లక్ష్మీకిరణ్, శ్రీనివాస్, ఏఎంవీఐలు షణ్ముఖ శ్రీనివాస్, యడ్ల సురేష్ పాల్గొన్నారు.

గ్యాస్ పైపులైన్ల భద్రతపై అవగాహన



గ్యాస్ పైప్‌లైన్ల భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాలాజీచెరువు: గెయిల్ (ఇండియా) లిమిటెడ్, కాకినాడ ఆర్డీవో సమన్వయంతో జిల్లా అధికారులకు గ్యాస్ పైపులైన్ల భద్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. గెయిల్ కార్యాలయంలో ఈపీడీసీఎల్, ఆర్అండ్‌బీ నీటి పారుదల విభాగం, అగ్నిమాపక, పోలీసు, పంచాయతీ తదితర శాఖలతో పాటు జిల్లాలోని గ్రామీణ, పట్టణ మండలాల నుంచి వీఆర్వోలు వంటి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు, ఉన్నతాధికారులు అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. గెయిల్ ఇండియా లిమిటెడ్ జీఎం (ఓఎం) వై.ఆనందకుమార్, కాకినాడ–రాజమండ్రి కార్యాలయానికి చెందిన ఇతర సీనియర్ అధికారులు, సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. గెయిల్ వ్యాపారం, కాకినాడలో ఇన్‌స్టలేషన్లు, సమాజ అవగాహన కోసం అందించే ఇతర అవగాహన కార్యక్రమాలకు సంబంధించి వీడియోలు ప్రదర్శించారు. జిల్లా అధికారులు అడిగిన ప్రశ్నలకు గెయిల్ కూడా సమాధానమిచ్చింది. అలాగే సహజ వాయు పైప్‌లైన్ భద్రత, సంబంధిత ప్రమాదాల గురించి సంక్షిప్త ప్రదర్శన జరిగింది.

బడ్జెట్‌లో కాపులకు పెద్దపీట



రావూరి వెంకటేశ్వరరావు

కాకినాడ: ప్రస్తుత 2023–24 బడ్జెట్‌లో సీఎం జగన్ కాపులకు పెద్దపీట వేశారని, ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మున్నెన్నడూలేని విధంగా కాపుల సంక్షేమానికి రూ.4,887 కోట్లు కేటాయించడం కాపులపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కాపుల సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్‌కు ఆంధ్రప్రదేశ్ కాపు ఫెడరేషన్ అండగా ఉంటుందన్నారు.

చక్రం తిప్పేస్తున్నారు



- కాలంతో పరుగులు తీస్తున్న యువత
- ఆవశ్యకమవుతున్న వాహనం
- డ్రైవింగ్ నేర్చుకుంటున్న మహిళలు
- ఏడాది కాలంలో 3400 లైసెన్స్‌లు

ఫీజులు ఇలా...	ఎల్‌ఎల్‌ఆర్.. (లెర్నింగ్)	పర్మినెంట్ లైసెన్స్
కారు, బైక్‌కు కలిపి	రూ.410	రూ.1260
కారుకి మాత్రమే	రూ.260	రూ.1260
ద్విచక్రవాహనం	రూ.260	రూ.1260

బాలాజీచెరువు: ఇంటి పగ్గాలే కాదు.. కారు పగ్గాలు పట్టడంలోనూ మహిళలు చొరవచూపుతున్నారు. కాలంతో పరుగులు పెట్టాల్సి వస్తుండడంతో వేచి ఉండే పరిస్థితిని అధిగమించేలా అంతా ముందడుగు వేస్తున్నారు. ఇంట్లో కారు ఉండి డ్రైవరో, నాన్నో, అన్నయ్యో వచ్చేదాకా వేచి ఉండాలంటే సాధ్యం కాని పరిస్థితి చాలా సార్లు ఎదురవుతుంది. ఈ నేపథ్యంలో కారు డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న మహిళల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. గత ఏడాది జనవరి నుంచి ప్రస్తుత సంవత్సరం మార్చి వరకూ ఏడాది కాలంలో కాకినాడ డివిజన్ పరిధిలలో బైక్, కార్లకు జారీ చేసిన లైసెన్స్‌లు 6500 వరకూ ఉండగా, అందులో 3400 వరకూ మహిళలే లైసెన్స్ పొందారు.

అవసరానికి ఉపయోగపడుతుంది



బైక్‌తో పాటు కారు నేర్చుకోవడం వల్ల అత్యవసరమైనప్పుడు సొంతంగా బయటకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. ఏడాది క్రితమే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాను. నేటి కాలంలో మహిళలకు డ్రైవింగ్ చాలా అవసరం. ముఖ్యంగా డ్రైవింగ్ వచ్చిన తరువాత లైసెన్స్ పొందడం చాలా ముఖ్యం.

– డాక్టర్ సీహెచ్ సుధ, జేఎన్‌టీయూకే

విద్యార్థినులకే ఎక్కువ లైసెన్సులు



విద్యార్థినులు, యువతులు ఎక్కువగా లైసెన్సులు తీసుకుంటున్నారు. చదువు పూర్తయ్యాక విదేశాల్లో అవసరమనో లేక ఇంటి అవసరాలకు ఉద్యోగరీత్యా డ్రైవింగ్ పట్ల ఆసక్తి చూపుతున్నారు. మహిళలు డ్రైవింగ్ నేర్చుకుంటే అన్ని విధాలా ఉపయోగపడుతుంది.

– ఎం.కళాజ్యోతి, ఏఎంవీఐ, కాకినాడ

స్వచ్ఛత పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం వంటి విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 22వ తేదీ లోపు నగర పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపికైన మహిళలకు జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ వేడుకల్లో అవార్డులు అందజేస్తారన్నారు.

వలంటీర్ పోస్టులకు..

సామర్లకోట: మండల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. చంద్రంపాలెం–1, జి.మేడపాడు–1, పీబీ దేవం–1, ఉండూరు–1, వేట్లపాలెం–1 వలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు సంగీత నీరాజనం

కాకినాడ కల్చరల్: స్థానిక సర్పవరంలోని భవానీ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీవాగ్గేయకారుల మండపంలో శనివారం సాయంత్రం సంగీత నీరాజం నిర్వహించనున్నట్లు సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. అన్నమాచార్య వర్ధంతిని పురస్కరించుకుని సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంగీత ప్రియులందరూ హాజరుకావాలని ఆమె కోరారు.

స్వర్ణ, రజత పుష్పాలతో మరిడమ్మకు పూజలు

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు.